తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# అంతరాష్ట్ర టువీలర్ దొంగలు అరెస్ట్

## - ఐదు లక్షల విలువ చేసే వాహనాలు స్వాధీనం !!



వి.కోట, జనవరి 3 ప్రభాతవార్త

ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడే అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు పలమనేరు డిఎస్పీ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వి.కోట మండలంలో టువీలర్ల చోరీలపై ఫిర్యాదులు అందడంతో సిఐ సోమశేఖర్‌రెడ్డి, ఎస్సై బాబులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. శుక్రవారం స్థానిక దుర్గమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి టువీలర్‌లో అనుమానాస్పద రీతిలో కన్పించగా అతన్ని పట్టుకుని విచారించగా టువీలర్ల దొంగతనాల వ్యవహారం బయటపడిందన్నారు. తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్‌కు చెందిన వసీం (25), ప్రేమ్‌కుమార్(26)లు చోరీ చేసిన వాహనాలు విక్రయించేవారన్నారు. జల్సాలకు అలవాటుపడి చోరీలు నిర్వహించేవారన్నారు.

# అకాశగంగ, పాపవినాశనమ్, చక్రతీర్థాలలో పూర్తి సౌకర్యాలు

## -టిటిడి ఈఓ శ్యామలరావు



తిరుమల, జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి: కొండపై ఉన్న తీర్థాల వద్ద భక్తులకు సౌకర్యంగా మెరుగైన ఏర్పాట్లుచేయాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. అకాశగంగ, పాప వినాశనమ్, చక్రతీర్థాలలో పార్కింగ్, లైటింగ్, పచ్చదనం, క్యూలైన్లు, సూచిక బోర్డులు, ఉప ఆలయాలలో ప్రసాద దిట్టం, పలు నిర్మాణ పనులు, అభివృద్ధిపై అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి చర్చించారు.

### రైతులకు సాగునీరు

# అందించే బాధ్యత నాదే

## - ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ఫోటో 3 వెంకటగిరి 03. తెలుగు గంగ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలయపల్లి, జనవరి 3, ప్రభాతవార్త

తెలుగు గంగ నీరు రైతులకు అందించి పంటలు సాగు చేసుకునే విధంగా తాను బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రైతులకు తెలిపారు. మండలం మావూరమ్మ చెరువు, చిలమనూరు చెరువులకు తెలుగుగంగ నుండి సాగునిరు అందించేందుకు నీటిపారుదల శాఖ, తెలుగుగంగ శాఖ, ఏపీఐ ఐసీ అధికారులు, స్థానిక రైతులతో కలిసి ఊట్లపల్లి, గొల్లగుంట ప్రాంతాలలో పర్యటించారు. ఈ చెరువులకి సాగునీరు అందించడం వలన సుమారు 2700 ఎకరాలకి పంట పండించుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆ గ్రామల రైతులకి జీవన ఉపాధితో పాటు వారి కుటుంబాలు సంతోషంగా ఉంటారు. ఈ చెరువులకు సాగునిరు అందిచటం వలన 5 గ్రామాల మెట్ట భూములు సాగులోకి రానున్నాయని తెలిపారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఎన్డీఏప్రభుత్వం రైతులకి తోడుగా ఉంటుంది అని తెలిపారు. ముఖ్యంగా రైతులకి నీరు అధించే కార్యక్రమం త్వరలో పూర్తి చేస్తాను అని తెలిపారు. ఈ కార్యక్రమం లో బాలయపల్లి మండల క్లస్టర్ ఇంచార్జ్ సత్యం నాయుడు మండల మాజీ అధ్యక్షులు దాసరి రాజగోపాల్ నాయుడు, పార్లమెంట్ రైతు విభాగ ప్రధాన కార్యదర్శి దాసరి ప్రభాకర్ నాయుడు ,మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, కోటంబెడు నాయకులు సురేంద్ర రెడ్డి, ఊట్లపల్లి నాయకులు మధు,నిడిగల్లు నాయకులు దాసరి కోటి, చిలమానూరు నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎటు వెళ్ళాలనేది సస్పెన్స్!



## ఏ కండువా వేసుకోవాలో తెలియక వైసిపి కార్పొరేటర్లు తికమక

ప్రభాతవార్త-తిరుపతి:

మరో ఏడాదికాలం వారందరికీ పదవి యోగం ఉన్నా గెలిచిన పార్టీలో పలు కారణాలతో ఇమడలేక...వేసుకున్న కండువా వదలి ఇతర పార్టీల కండువాలు వేసుకునేందుకు సిద్ధమవుతున్నా ఏ పార్టీలోకి వెళ్ళాలనేది వారంతా తేల్చుకోలేకపోతుండటం సస్పెన్స్‌గా మారింది. ఒక్కసారిగా పెద్దసంఖ్యలో కార్పొరేటర్లు గెలిచిన పార్టీని వీడి ప్రస్తుతంఅధికారంలో ఉన్న కూటమిపార్టీల్లోని టిడిపి,జనసేనపార్టీల్లో చేరాలని ఉబలాటపడుతున్నా వారికి కాలం కలసిరావడం లేదు. కూటమి పార్టీల అధిష్టానం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వీరి చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడమే ప్రధాన కారణం. ఇప్పుడున్న పరిస్థితుల్లో వేసుకున్న కండువా తీసేసి ఏ కండువా వేసుకోవాలనేది తిరుపతిలోని పెద్దసంఖ్యలో కార్పొరేటర్లు అయోమయంలో ఉన్నారు. వాళ్ళంతా వైసిపిని వీడేందుకు సిద్ధమైపోయినా ఆ పార్టీలో వీరిని బుజ్జగింపులుకూడా చేసేవారే లేకపోవడం మరో కొసమెరుపు. తిరుపతినగరపాలకసంస్థగా(మున్సిపల్ కార్పొరేషన్) రూపాంతరం చెందిన తరువాత 2021 మార్చిలో తొలిసారిగా తిరుపతిలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 50 డివిజన్లుగా విభజించిన ప్రభుత్వం ఆ ఎన్నికల్లో 50 డివిజన్లకు అప్పటి అధికార వైసిపి, టిడిపి,వామపక్ష పార్టీలనుండి అభ్యర్థులుపోటీకి దిగారు. అయితే అప్పటి పరిస్థితుల్లో వైసిపి నేతలు రాజకీయం చేసి తమదైన శైలిలో తిరుపతి నగరపాలకసంస్థలో అత్యధికంగా 22 డివిజన్లలో కార్పొరేటర్లను ఏకగ్రీవం చేసుకున్నారు. ప్రస్తుతం మేయర్‌గా కొనసాగుతున్న డాక్టర్ శిరీష, ఉప మేయర్‌గా ఉన్న ముద్రనారాయణతోబాటు గతంలో రాజీనామా చేసిన భూమన అభినయ్‌రెడ్డి కూడా ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మిగిలిన 28 డివిజన్లకు ఎన్నికలు జరగ్గా 7వ డివిజన్‌లో కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదాపడింది. 27 డివిజన్లకుగాను ఒక డివిజన్ టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ గెలుపొందారు. మరో 27 డివిజన్లలో వైసిపి కార్పొరేటర్లు గెలిచేలా చేసుకున్నారు. ఎన్నికల తరువాత కొంతకాలానికి ఒక వైసిపి కార్పొరేటర్ మృతి చెందాడు. ఇప్పుడు రెండు కార్పొరేటర్లు ఖాళీగానే ఉన్నాయి. 2021 ఎన్నికల్లో ఏదోరకంగా గెలిచిన వైసిపి కార్పొరేటర్లలో చాలావరకు కొందరు గెలిచామనే తంతుగా మారింది. ఇంకొందరు అప్పట్లోనే టిడిపి నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడం, దౌర్జన్యం దిగడం వంటి ఘటనలకు పాల్పడ్డారు. గత నాలుగేళ్ళలో వైసిపి కార్పొరేటర్లలో నిరాశనిస్పృహలు అలముకున్నాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి పార్టీలు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడంతో తిరుపతిలో జనసేన పార్టీ ఎంఎల్ఏ కొనసాగతున్నారు. నగరపాలకసంస్థలో వైసిపి కౌన్సిల్‌లో ఉపమేయర్ అభినయ్ రాజీనామాతో పలువురు కార్పొరేటర్లు స్తబ్ధుగా ఉన్నారు. కొందరు ఏకంగా ఏడాదిముందు గెలిచిన పార్టీని వీడి కూటమి పార్టీలో చేరడానికి పావులు కదిపారు.అయితే అప్పటికే సిఎం చంద్రబాబు అంగీకరించకపోవడంతో వారి ఆశలు నిరాశగానే మారాయి. ఇప్పటికీ వైసిపి కార్పొరేటర్లు ఉపమేయర్ ముద్ర నారాయణతోబాటు ఇంకొందరు వైసిపి కండువాను తీసేసి స్వతంత్రులుగా చలామణి అవుతున్నారు. వీరంతా కలసి కూటమి పార్టీల్లో చేరేందుకు సుముఖత చూపుతున్నా తిరుపతిలో జనం నాడి గమనించి ఏడాదికాలం ఉండగానే ఇప్పుడు రాజకీయం చేయడం బాగోదని ఆయా పార్టీలు వీరిని చేర్చుకునేందుకు విముఖతగా ఉన్నాయి. ఇప్పుడు తిరుపతి నగరంలో వైసిపి వ్యతిరేక కార్పొరేటర్లు పరిస్థితి నూనెలో పడ్డ ఈగలాతయారైంది. మరీ కాలం వీరి భవిష్యత్తును నిర్ణయించనుందని తిరుపతి జనంలో హాట్‌టాఫిక్‌గా మారింది.

# సిఎం చంద్రబాబు కుప్పం టూర్ ఖరారు

## - ఈనెల 6,7న పర్యటన.. రెండు రోజుల మకాం..



కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు రోజుల కుప్పం టూర్ ఖరారైంది. ఈనెల 6,7 తేదీల్లో సిఎం చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తారు. అధికారవర్గాల ద్వారా తెలిసిన సమాచారం మేరకు సిఎం పర్యటన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 6వతేది సిఎం చంద్రబాబునాయుడు ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం ద్రవిడ వర్సిటీకి చేరుకుని విజన్ డాక్యుమెంట్ ప్రారంభం, అగరం కొత్తపల్లి గ్రామంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కుప్పం మున్సిపల్ పరిధి చీగలపల్లిలో ప్రకృతి వ్యవసాయ రైతులతో సమావేశమవుతారు. ఆపై కుప్పం మండలం నడిమూరులో సౌర విద్యుత్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం మరలా ద్రవిడ వర్సిటీ చేరుకుని అక్కడ ముఖ్యనేతలతో సమావేశమవుతారు.రాత్రి బసకు కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారు. 7వతేది ఉదయం కుప్పం తెదేపా కార్యాలయం వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరించిన అనంతరం కంగుంది గ్రామం చేరుకుని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తండ్రి దివంగత పిఆర్ శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఆపై కుప్పం ఎన్టీఆర్ స్టేడియం చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ద్రవిడ వర్సిటీలో జిల్లా అధికారులతో సమీక్ష జరిపిన అనంతరం కుప్ప ం ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 8వతేది ఉదయం ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్‌నుంచి తిరుగుప్రయాణం అవుతారు. కాగా ఈ పర్యటన షెడ్యూల్ ప్రాథమికంగా అందింది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## గట్టి భద్రత ఏర్పాట్లు



కుప్పం నియోజకవర ్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఓవైపు పర్యటన ఏర్పాట్లు చేపట్టడంతో పాటు మరో పక్క గట్టి భద్రత ఏర్పాట్లను చేపడుతోంది. శుక్రవారం సిఎం స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ అధికారులు కుప్పం వచ్చారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చ ందోలు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పిడి వికాస్ మర్మత్, ఎస్ఎస్‌జి ఎఎస్పీ రమణ, జిల్లా ఎఎస్పీ రాజశేఖర్‌బాబు, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, తదితరులు సిఎం పర్యటన ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు.

# అవినీతి రిజిస్ట్రార్‌ను తక్షణం తొలగించాలి .

- -ఎస్వీయూ స్క్రాప్ ను నిబంధనలకు విరుద్ధంగా తరలించేశారు.
- -60లక్షల విలువచేసే స్క్రాప్ ను రూ.8 లక్షలకే అప్పనంగా అప్పగించేశారు.
- -అధికార పార్టీ అనుచరులకు అప్పగించి వర్సిటీ ఆదాయానికి గండికొట్టారు.
- -తక్షణం రాజీనామా చేయాలంటూ రిజిస్ట్రారు నిలదీసిన విద్యార్థి సంఘాలు.



తిరుపతి విద్య జనవరి 3 ప్రభాత వార్త:

ఎస్వీయూలో స్క్రాప్ ను తమ అనుచరవర్గానికి అప్పనంగా అప్పగించి వర్సిటీ ఆదాయానికి గండికొట్టిన రిజిస్ట్రార్ భూపతి నాయుడును తక్షణం విధుల నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.వర్సిటీ గత 20ఏళ్లకు పైగా నిల్వ ఉంచిన స్క్రాప్ ను నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ టెండర్లు పిలువకుండా రిజిస్ట్రార్ అప్పనంగా తమ వారికి విక్రయించడంపై విద్యార్థి సంఘాలు శుక్రవారం వర్సిటీలో రిజిస్ట్రార్ ను నిలదీశాయి. ఈ సదర్భంగా ఏఐఎస్ఎఫ్, వైఎస్సార్సీపీ, దళిత విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ వర్సిటీని అవినీతిపరుడైన రిజిస్ట్రార్ అక్రమార్జనే ధ్యేయంగా స్క్రాప్ ను సైతం వదలకుండా పీక్కు తింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రూ.60లక్షల విలువగల పాత సామాన్లు,ఐరన్,కుర్చీలు,డెస్కులు,ప్లాస్టిక్ వ్యర్థాలను కేవలం రూ.8 లక్షలకే విక్రయించడం దారుణమన్నారు.ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి రిజిస్ట్రార్ భూపతినాయుడేనని,బహిరంగ టెండర్లును ఆహ్వానించకుండా లోపాయికారి ఒప్పందంతో తమ అనుచరులకు విక్రయించారని ఆరోపించారు.అధికార పార్టీ నాయకులను వెంటబెట్టుకుని ఇలాంటి అవినీతికి పాల్పడుతున్న రిజిస్ట్రార్ ను ప్రభుత్వం వెంటనే తొలిగించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే సుమారు 20 లారీల మేర స్క్రాప్ ను వర్సిటీనీ నుంచి విక్రయించారని,దీనిపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల విద్యాదేవాలయంలో అవినీతి పరులకు చోటు లేదన్నారు. విక్రయించిన స్క్రాప్ ను వెనక్కి తీసుకురావాలని లేని పక్షంలో పోరుబాట తప్పదని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయక కార్యదర్శి బండి చలపతి,జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఉదయ్,ప్రవీణ్, వైఎస్సార్సీపీ వర్సిటీ విద్యార్థి విభాగం అధ్యక్షులు ఎం ప్రేమ్ కుమార్,దళిత విద్యార్థి సంఘం నాయకులు యుగంధర్, శివశంకర్ నాయక్,ఓ బి సి నాయకులు తిరుమలేష్, రుకేష్ పాల్గొన్నారు.

# ఏడు కొత్త ఎయిర్ పోర్టులపై సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్‌తో సమీక్ష



తిరుపతి కలెక్టరేట్, జనవరి 3 ప్రభాతవార్త :

రాష్ట్రంలో కొత్తగా ఏడు ఎయిర్ పోర్టులు రానున్నాయి. వీటిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్న ప్రభుత్వంఆ ప్రాజెక్టులను గ్రౌండ్ చేసే పనులు మొదలు పెట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం ఏడు ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. విశాఖ, తిరుపతి, కడప, రాజమండ్రి, గన్నవరం ఎయిర్ పోర్టులను ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. అయితే పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో కొత్తగా మరో ఏడు ఎయిర్ పోర్టులను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కొన్ని ప్రాజెక్టులు అడుగులు వేయగా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పక్కన పెట్టింది.ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టులతో పాటు ఏవియేషన్ యూనివర్శిటీ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ఎయిర్ పోర్టుల్లో ప్రైవేట్ ఫైట్స్ పార్కింగ్ అవసరాలు పెరుగుతాయని, వాటిని కూడా దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచించారు.

# తిరుచానూరులో దొంగలు హల్ చల్

## తాళం వేసిన ఇంటిలో చోరీ యత్నం

## వరుస దొంగతన యత్నాలతో గ్రామస్తుల భయాందోళన





తిరుచానూరు, జనవరి 3, ప్రభాత వార్త:

తాళం వేసిన ఇంటిలో చోరీ యత్నం చేసిన ఘటన తిరుచానూరు పంచాయతీ దరణి లేఔట్లో చోటుచేసుకుంది. తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ సమాచారం మేరకు ఇంటి యజమాని శ్రీనివాసులు శ్రీవారి దర్శనం కొరకు కుటుంబ సమేతంగా తిరుమలకు మంగళవారం పయనమయ్యారు. గత మూడు రోజులుగా తాళం వేసి వుండటం గమనించిన దుండగలు చోరీ యత్నానికి ప్రయత్నించారు. కిటికి వద్ద, ఇంటి ప్రదాన ద్వారం తలుపులు విరిగి, మంచము క్రింద రహస్య అరలలో దొంగలు గాలించిన అనవాలు లబించాయి. సమీపంలోని సిసి ఫుటేజ్ ఆదారాల మేరకు శుక్రవారం ఉదయం ఒంటిగంట ప్రాంతంలో చోరీకు ప్రయత్నించినట్లు తెలుస్తున్నది. ఇది ఇలా వుండగా తమ ఇంటిలోని వెండి వస్తువులు అలాగే వున్నాయని ఎటువంటి నగదు, బంగారం చోరీకి గురుకాలేదని ఇంటి యజమాని తెలియజేసారు. ఏదిఏమైనప్పటికీ వరుసగా దుండగులు చోరీ యత్నాలకు పాల్పడటం గ్రామస్తులను కలవరపాటుకు గురిచేస్తున్నది. ఈ సందర్భంగా తిరుచానూరు సిఐ మాట్లాడుతూ క్లూస్ టీమ్ ఆదారాలు సేకరిస్తున్నారని తెలియజేశారు. రానున్న రోజులలో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వివరించారు.

# చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా శంకర్‌నాయుడు

చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:

చిత్తూరు న్యాయవాదుల సంఘ అధ్యక్షులుగా శంకర్‌నాయుడు శుక్రవారం ఎన్నికయ్యారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం చిత్తూరు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు ప్రధాన ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది జి.వసంత్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాదులు కెఎస్ రవీంద్రన్, ఎస్.విజయభాస్కర్‌లు వ్యవహరించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 392 న్యాయవాదులకు ఓటు హక్కు వుండగా ఇందులో 373 మంది న్యాయవాదులు ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహించి గెలుపొందిన వారి వివరాలు ఎన్నికల అధికారులు ప్రకటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం నలుగురు న్యాయవాదులు పోటీ పడగా ఇందులో శంకర్‌నాయుడు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పోటీ చేసిన శంకర్‌నాయుడుకు 176 ఓట్లు లభించగా మద్దిపట్ల చంద్రశేఖర్‌కు 102, మోహన్‌రామిరెడ్డికి 48, హరికృష్ణకు 26, జానకిరామరెడ్డికి 22 ఓట్లు లభించాయి. అధ్యక్షులుగా శంకర్‌నాయుడు తన సమీప ప్రత్యర్థి ఎం.చంద్రశేఖర్‌పై 74 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అలాగే ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా సురేష్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పోటీ చేసిన న్యాయవాది సురేష్‌రెడ్డికి 204 ఓట్లు లభించగా, చక్రవర్తిరెడ్డికి 101, విశ్వనాథ్‌కు 65 ఓట్లు వచ్చాయి. బార్ అసోసియేషన్ కార్యదర్శిగా సురేష్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి చక్రవర్తిరెడ్డిపై 103 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కోశాధికారి పోస్టు కోసం ముగ్గురు న్యాయవాదులు పోటీ పడగా ఇందులో న్యాయవాది ఆనంద్ విజయం సాధించారు.

# అన్ని కంప్యూటర్ ల్యాబ్‌లే: ఒక్కొక్క చోట ఒక్కొక్క ఫలితం

## డాక్టర్ రాసిన ల్యాబ్‌లోనే పరీక్షలు చేయించుకోవాలి! పత్తాలేని డ్రగ్ ఇన్స్‌పెక్టర్: వైద్యం పలువురి ఇష్టారాజ్యం

శ్రీకాళహస్తి:ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో వైద్యసదుపాయాలు ఆగమ్యగోచరంగా మారింది. సామాన్యునికి ఆనారోగ్యం చేస్తే ఏడాది ఆదాయం ఒక్కసారి డాక్టర్ వద్దకు వెళితే హరించుకుపోతుంది. నిరుపేదల పరిస్థితి అప్పుల పాల్జేస్తుంది. కొందరు డాక్టర్లు అయితే జ్వరం అంటానే ల్యాబ్‌కు పంపుతున్నారు. అయితే పుణ్యక్షేత్రంలో ల్యాబ్‌ల పరిస్థితి గమనిస్తే అన్ని కంప్యూటర్ ల్యాబ్‌లే కానీ ఒక్కొక్క ల్యాబ్‌లో ఒక్కొక్క రకం ఫలితం వస్తుంది. ప్రస్తుతం కొందరు డాక్టర్లు వారే స్వయంగా ల్యాబ్‌లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఓ వైపు డాక్టర్ ఫీజులు, మరో వైపు సాంపుల్స్ మందులతో వ్యాపారం లాభాలు, ఇంకొక వైపు లాబ్‌లతో కనకవర్షం కురిపించుకుంటున్నారు.అయితే నిరుపేదలకు అందుబాటులో వైద్యం అందేలా, మందుల ధరలు అదుపు అయ్యేలా నాణ్యమైన మందులను అందేలా చూడాల్సిన డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పరిశీలనలు ఏమిటో ముక్కంటీశునికే ఎరుక అన్నట్లు మారింది.

### శ్రీకాళహస్తిలో ల్యాబ్‌ల మాయాజాలం:

శ్రీకాళహస్తిలో ల్యాబ్‌ల పరిస్థితి పరిశీలిస్తే కేవలం రెండు ల్యాబ్‌లకు మాత్రమే అధికారిక అనుమతి ఉన్నట్లు సమాచారం. మిగిలిన అన్ని డాక్టర్స్ బినామిలుగా నడుస్తున్నట్లు సమాచారం.ఒక్కొక్క వీధికి ఒక్కొక్క ల్యాబ్ వెలసింది. స్కానింగ్ సెంటర్లు వచ్చాయి. అయితే ల్యాబ్‌ల పరిస్తితి పరిశీలిస్తే ఒకే రోజు ంరెండు ల్యాబ్‌ల్లో రక్త పరీక్షలు జరిపించుకుంటే ఒక్కొక్క చోట ఒక్కొక్క విధంగా ఫలితాలు వస్తుంటాయి. ఇక డాక్టర్లు ఇచ్చిన ల్యాబ్ కే వెళ్ళి వైద్యపరీక్షలు,రక్త పరీక్షలు జరిపించుకోవాలి. పొరబాటున ఎవరైనా వేరే ల్యాబ్‌కు వెళితే ఇక ఆ ఫలితాలు సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తారు.



కారణం డాక్టర్ రాసిన ల్యాబ్‌తో మిలాఖత్,పర్సంటేజ్‌లు అందుతాయి. ఇలా ల్యాబ్‌లలో కూడా డాక్టర్లు తమ హవా నడుతారు. వారు నడిపేల్యాబ్‌లో రక్త పరీక్షలు జరిపించుకుంటే ఓ కే.

### డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పర్యవేక్షణ ఏదీ?

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంతో పాటు సూళూరుపేట,గూడూరు డివిజన్‌లలో మందుల షాపుల పరిశీలన,పర్యవేక్షణ తనిఖీ చేసే అధికారం కల్గిన అధికారి డ్రగ్ ఇన్స్‌పెక్టర్. మూడు నియోజకవర్గాల్లో కలసి సుమారు. 2200 నుంచి 2300 మందుల షాపులుంటాయి.వీటిలో మందుల నాణ్యతతో పాటు గుర్తింపు పొందిన కంపెనీలకు సంబంధించి పర్యవేక్షించాల్సి ఉంది. ఒక అధికారి ఆరు నియోజకవర్గాలలో పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే ఈ పర్యవేక్షణకు ఓ మహిళా అధికారిని నియమించారు. నెల్లూరుకు చెందిన ఈమె గతంలో పలు ఎసిబి కేసుల్లో ఉన్నారు. పలుకుబడితో మళ్ళీ డ్రగ్ ఇన్స్‌పెక్టర్ అయ్యారు. ఆరు నియోజకవర్గాలోని సుమారు 2300 షాపుల నుంచి నెల నెలా ఒక్కొక్క దుకాణం నుంచి రూ.200ల చొప్పున వసూలు చేయుటకు ఏజెంట్లను నియమించుకుంటారు.ఇలా మందుల దుకాణాదారులనుంచి 'మామూళ్ళకు' అలవాటు పడిన అధికారి మొక్కుబడిగా పర్యటించి పరిశీలించినట్లు తమ ఏజెంట్స్ ద్వారా మీడియాలో పబ్లిసిటి ఇచ్చుకుంటూ కాలం గడుపుతూ నిరుపేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.

### ప్రభుత్వం స్పందించాలి:

పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నిరుపేదల అనారోగ్యాలతో చెలగాటమాడుతున్న వైద్యులకు సంబంధించి స్పందించాల్సి ఉంది.డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఖచ్చితంగా పని చేస్తే కొంత వరకు అయినా కట్టడి అవుతుంది. కానీ ఎందుకో ఆ దిశగా చర్యల్లేవు. మరి నిరుపేదల ఆరోగ్యానికి సంబందించి ప్రభుత్వం ప్రకటనలే తప్ప ఆచరణకు నోచుకోవటం లేదన్నది జగమెరిగిన సత్యం.

## గణనాధుని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం, జనవరి 3 ప్రభాతవార్త: కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమలేఖ శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజి నాయుడు, ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్‌లతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, జనవరి 3 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తురాలు శుక్రవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన శకుంతల అనే భక్తురాలు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొతా_న్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## వరసిద్దుని సేవలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల ఛైర్మన్



కాణిపాకం, జనవరి 3 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల ఛైర్మన్ కె.కోటేశ్వర చౌదరి శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ చెస్ టోర్నీకి విద్యార్థి ఎంపిక

కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త

సౌత్ జోన్ అంతర్ వర్సిటీ చెస్ టోర్నమెంట్‌కు కుప్పం డిగ్రీ కాలేజ్‌లో బికా ం(సిఎ)ఫైనలియర్ చదువుతున్న విద్యార్థి జగపతి ఎంపికైనట్లు కాలేజ్ ఛైర్‌పర్సన్ శాంతనాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన పోటీల్లో జగపతి ఉత్తమ ప్రతిభ కనబరచి తిరుపతి ఎస్వీయు జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 8వతేది నుంచి తమిళనాడు వెల్‌టెక్ వర్సిటీలో జరిగే అంతర్ వర్సిటీ చెస్ పోటీల్లో అతను పాల్గొంటాడన్నారు. ఈసందర్భంగా జగపతిని, కళాశాల పిడి సుధాకర్‌ను ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు.

## వైకాపాను వీడి తెదేపాలో చేరిన నేతలు

కుప్పంరూరల్, జనవరి 3 ప్రభాతవార్త

మండలంలోని మల్లానూరు, టి. సదుమూరు గ్రామాలకు చెందిన ఇరవై మంది వైకాపా నేతలు ఆ పార్టీని వీడి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వైకాపా నేతలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తదితరులు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నేతలు రామచంద్ర, మోహన్, దామోదర్, ప్రకాష్, రాజ్‌కుమార్, నాగార్జుర, వెంకటేష్, తులసి తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ పోల్ ఏర్పాటు చేయండి

పాకాల, జనవరి 3, ప్రభాతవార్త

పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయతీ మల్లెల చెరువుపల్లి దళిత వాడలో గత మూడు సంవత్సరాల నుంచి రాతి కూసమే కరెంటు పోలుగా మారి సేవలందిస్తూ వుంది. గాలి వానకు విద్యుత్ స్థంభం విరిగి పోయి ఇప్పటికి మూడు సంవత్సరాలు గడచినా ఎన్నిసార్లు ఏఈ, లైన్ ఇన్స్పెక్టర్ వారికి చెప్పినా పట్టించుకొనే నాధుడే కరువైయ్యరు అని గ్రామస్తులు బహిరంగానే విమర్శిస్తున్నారు. దళితవాడలోని ప్రజల అవస్థలకు క్షేత్ర స్థాయిలోని అధికారుల నిర్లక్ష్యమే కారణం. పై అధికారులు ఇకనైనా స్పదించి ఈ సమస్యను ఇప్పటికయినా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వెంటనే విద్యుత్ స్థంభం ఏర్పాటు చేయాలి అని స్థానిక ప్రజలు మరియు భారతీయ జనతా పార్టీ ఓ బి సి జిల్లా ఉపాధ్యక్షుడు కొడగంటి నరేంద్రబాబు కోరుతున్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

తవణంపల్లె, జనవరి 3 ప్రభాతవార్త: మతి స్థిమితం లేని వ్యక్తి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెంది వుండడాన్ని కారకాంపల్లె గ్రామం వద్ద శుక్రవారం స్థానికులు కనుగొన్నారు. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. కారకాంపల్లె గ్రామానికి చెందిన జయరాంనాయుడు వ్యవసాయ బావిలో ఒక వ్యక్తి మృతి చెంది పడి వుండడాన్ని స్థానికులు శుక్రవారం కనుగొని పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి చిత్తూరు నగరం గిరింపేటకు చెందిన బి.శంకర్ నారాయణ(54)గా గుర్తించారు. మృతునికి గత ఏడు నెలల క్రితం బ్రెయిన్ ఆపరేషన్ చేయడంతో అప్పటి నుండి మతి స్థిమితం లేకుండా పోయింది. ఈనేపథ్యలో గత నెల 22న ఇంటి నుండి వెళ్ళిపోయిన శంకర్‌నారాయణ కారకంపల్లె గ్రామం వద్ద జయరాం నాయుడు వ్యవసాయ బావిలో శవమై తేలాడు. ఇతను ప్రమాదశాత్తు బావిలో పడి మృతి చెంది వుండవచ్చునని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ గజేంద్ర తెలిపారు.

## భూసమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు

పాలసముద్రం, జనవరి 3 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తహసిల్దారు అరుణకుమారి అన్నారు. మండలంలోని వనదుర్గాపురం గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసిల్దారు అరుణకుమారి పాల్గొని మాట్లాడుతూ రైతులు, ప్రజలకు ఎవరికైనా భూములకు సంబంధించి దీర్ఘకాలికంగా ఎదైనా సమస్య వున్నా వాటిని తమ దృష్టికి తీసకువస్తే పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సులతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరు మీ గ్రామానికే వస్తున్నారని, భూసమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. రైతులు, ప్రజలు భూసమస్యలు తీసుకుని తహసిల్దారు కార్యాలయం చుట్టూ ప్రదిక్షిణలు చేయాల్సిన అవసరం లేదని, మీ గ్రామానికి రావడంతో ఆ సమస్యలను ఇక్కడ విన్నవిస్తే పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం వనదుర్గాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూములకు సంబంధించి ఒక సమస్య, ఎస్ఆర్ఆర్ కండ్రిగ గ్రామంలో నిర్వహించిన సదస్సులో రెండు సమస్యలను తహసిల్దారు అరుణకుమారి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వనదుర్గాపురం సర్పంచ్ నరసింహరాజు, మండల సర్వేయర్ గణేష్, ఎంఆర్ఐ దేవి, గ్రామ సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

## మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో పుస్తకాల పంపిణీ



కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త

కుప్పం రామచంద్రారోడ్‌లో ఉన్న మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పిల్లలకు పుస్తకాలు, పౌష్టికాహారంను పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ సోమశేఖర్ మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు క్రమం తప్పక ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పంపిణీ చేయడంతో పాటు వారికి తగు ఆహార సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జ్ ఆర్ఆర్ రవి, వార్డు పార్టీ అధ్యక్షుడు శ్రీదర్, అంగన్‌వాడీ కార్యకర్త నీలిమ పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌టిఎ డైరీని ఆవిష్కరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త: వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్-2025 నూతన డైరీని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. తిరుపతిలోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శుక్రవారం వైఎస్ఆర్‌టిఎ రాష్ట్ర కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌టిఎ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ రూపొందించిన డైరీని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించి డైరీలో ఉపాధ్యాయులకు ఉపయోగపడే అంశాలు మొత్తం పొందుపరచడంతో వారికి ఈ డైరీ ఎంతో ఉపయోగంగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్‌టిఎ అధ్యక్షులు యువరాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి జయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

పుంగనూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త

సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను శుక్రవారం పుంగనూరులో ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక ఇందిరా కూడలిలో సావిత్రిబాయి పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలోని మొదటి మహిళా ఉపాధ్యాయుల్లో ఒకరైన సావిత్రిబాయి పూలే తన జీవిత కాలాన్ని మొత్తం పేదలకు సమాజానికి అంకితం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అద్దాల నాగరాజా, ఆయుబ్ ఖాన్, కృష్ణమూర్తి, గంగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఫోటో

## అమ్మవారు ఆలయాల్లో ఘనంగా పూజలు



పుంగనూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త

శుక్రవారం వివిధ ఆలయాలలో అమ్మవార్లకు పెద్ద ఎత్తున ప్రజల నిర్వహించారు. తూర్పు మొగసాలలో కొలువైన శ్రీ చాముండేశ్వరి దేవి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి ఎదుట పిండి దీపాలు వెలిగించి, అంబలి సమర్పించారు. కాగా బస్టాండ్ వద్ద శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో అమ్మవారిని గంధం, కుంకుమ, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని దర్శించారు. బెస్త వీధిలో వెలసిన శ్రీ సుగుటూరు గంగమ్మ శుక్రవారం విశేష పూజలు అందుకుంది. కుంకుమ, పసుపు గంధం, వేపాకులతో పాటు పట్టు చీరతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా, పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించారు.

## బిజెపి అధ్యక్షుడిగా జగదీశ్ రాజు

పుంగనూరు, జనవరి 3, ప్రభాతవార్త

మండలం రాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్ రాజు పట్టణ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నియోజకవర్గ ఇన్చార్జ్ మదన్మోహన్ తెలిపారు. బీజేపీ నియమాలను పాటిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## మహిళా సమాజ ఉద్ధారకురాలు సావిత్రిబాయి పూలే

చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:

మహిళా సమాజ ఉద్ధారకురాలు సావిత్రిబాయి పూలే అని సీనియర్ బిజెపి నాయకుడు కొల్లా చిట్టిబాబు అన్నారు. జ్యోతిరావుపూలే సతీమణి సావిత్రిబాయి జయంతి పురస్కరించుకుని సీనియర్ బిజెపి నాయకుడు కొల్లా చిట్టిబాబు ఆధ్వర్యంలో చిత్తూరు కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లా చిట్టిబాబు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా అధ్యరాసత్యతకు దోహదపడ్డారన్నారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా మహిళల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తించబడిన సావిత్రిబాయి చిత్రపటానికి ఈ సందర్భంగా కొల్లా చిట్టిబాబు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ భారతిదేవి, బిజెపి నాయకులు సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు ఝాన్సీ, సుమలత, సుష్మ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ప్రాణాలతో అధికారులు చెలగాటం

### - శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం

పాలసముద్రం, జనవరి 3 ప్రభాతవార్త

అభం శుభం తెలియని చిన్న పిల్లల ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారు. పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ దిగువ వనదుర్గాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం దీర్ఘకాలంగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో చిన్నారులు అనునిత్యం వెళ్ళి తెల్లవారు నుండి సాయంత్రం వరకు వుండి వస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరినా అందులో చిన్న పిల్లలు వుంటున్నారన్న జ్ఞానం అధికారులకు లేకపోవడంతో స్థానిక అంగన్‌వాడీ క్యాకర్త, ఆయాలు అందులోనే వుండి చిన్నారులకు కార్యక్రమాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. అంగన్‌వాడీ కేంద్రం శిధిలావస్థకు చేరడంతో పై నుండి పెచ్చులు ఊడి పిల్లలపై పడుతుండటంతో అంగన్‌వాడీ కేంద్రంకు తమ పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఒకొక్కసారి అంగన్‌వాడీ కార్యకర్తలు శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రంలో కాకుండా విద్యార్థులు భవనం వెలుపల వుంచి కార్యక్రమాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. 1999 సంవత్సరంలో నిర్మించిన ఈ అంగన్‌వాడీ భవనం ఇప్పటికే శిథిలావస్థకు చేరింది. ఇక్కడికి అంగన్‌వాడీని విద్యనభ్యసించే చిన్నారులతో పాటు గర్భిణీ స్త్రీలు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవడానికి వస్తుంటారు. పాలసముద్రం మండలంలో గతంలో ఇప్పటికే విద్యార్థులు లేని సమయంలో ఓ పాఠశాల భవనం నెలకొరిగిన విషయం తెలిసిందే. అలాంటి పరిస్థితి తలెత్తకుండా సత్వరం దిగువ వనదుర్గాపురం గ్రామంకు నూతన అంగన్‌వాడీ భవనం మంజూరు చేసి త్వరితంగా నిర్మించి అంగన్‌వాడీ పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా చూడాలని ఉన్నత అధికారులను తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## .అనుమానితులకు ప్రతివారం గళ్ళ పరీక్ష

### - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి

చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి ఆశా కార్యకర్త అనుమానితుల నుండి ప్రతివారం గళ్ళను సేకరించి పరీక్ష నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశహాలులో శుక్రవారం డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి ల్యాబ్ టెక్నిషియన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ రెండు వారాల పాటు దగ్గు వున్న ప్రతి ఒక్క కేసుతో పాటు పిహెచ్‌సికి ఓపికి వచ్చే పేషంట్లలో 10 శాతం మందికి తప్పనిసరిగా టిబి పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి ఆశ కార్యకర్త ప్రతి వారం గళ్ళ పరీక్ష కిట్ల ద్వారా ఆనుమానిత కేసుల నుండి గళ్ళను సేకరించి పిహెచ్‌సిల్లో పరీక్షించాలన్నారు. డాక్టర్లు, సూపర్‌వైజర్లు వీటిని పర్యవేక్షించి పాజిటివ్ వచ్చిన వారికి చికిత్స ప్రారంభించి పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. 2025 నాటికి టిబి లేని సమాజం ఆవిష్కరణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డిప్యుటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, ఎఎంఓ రామచంద్రారెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు రామకృష్ణ, శివకుమార్, జిల్లాలోని పిహెచ్‌సిల ల్యాబ్ టెక్నిషియన్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్లకు అవకాశం

### - మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త: జీవనోపాధులు మెరుగుపరచడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో హోంట్రయాంగిల్ యాప్ సంస్థతో కలిసి సేవలు అందించడానికి సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణాల్లోని గృహాలు, ఎలక్ట్రికల్ సర్వీసింగ్, పబ్లింగ్, వడ్రంగి వంటి గృహ సంబంధిత సేవలు అందించడానికి వీలుగా సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించి, రిజిస్ట్రేషన్ చేసి, వారికి శిక్షణ అందించే కార్యక్రమంను చేపడుతున్నామన్నారు. హోమ్ ట్రయాంగిల్ యాప్ ద్వారా వినియోగదారులకు సేవలు అందించానికి వీలుగా యాప్ పని చేస్తుందన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అంతరాష్ట్ర టువీలర్ దొంగలు అరెస్ట్

### - ఐదు లక్షల విలువ చేసే వాహనాలు స్వాధీనం !!

వి.కోట, జనవరి 3 ప్రభాతవార్త

ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడే అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు పలమనేరు డిఎస్పీ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వి.కోట మండలంలో టువీలర్ల చోరీలపై ఫిర్యాదులు అందడంతో సిఐ సోమశేఖర్‌రెడ్డి, ఎస్సై బాబులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. శుక్రవారం స్థానిక దుర్గమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి టువీలర్‌లో అనుమానాస్పద రీతిలో కన్పించగా అతన్ని పట్టుకుని విచారించగా టువీలర్ల దొంగతనాల వ్యవహారం బయటపడిందన్నారు. తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్‌కు చెందిన వసీం (25), ప్రేమ్‌కుమార్(26)లు చోరీ చేసిన వాహనాలు విక్రయించేవారన్నారు. వీరిద్దరూ జల్సాలకు అలవాటుపడి చోరీలు నిర్వహించేవారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రామకుప్పం, జనవరి 3 ప్రభాతవార్త

మండల సరిహద్దుల్లోని కర్ణాటక రాజుపేట రోడ్‌లో కారు, టువీలర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కృష్ణమనాయనపల్లికి చెందిన వెంకటరెడ్డి (36), గెర్నిపల్లికి చెందిన రమేష్‌రెడ్డి (38)లు సొంత పనుల నిమిత్తం వెళ్తుండగా ఎదురుగా ద్విచక్రవాహనం కారు ఢీకొన్నాయి. దీంతో వారిద్దరికీ తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు.

## మణీంద్రంలో రెవెన్యూ సదస్సు

రామకుప్పం, జనవరి 3 ప్రభాతవార్త

మండలంలోని మణీంద్రం గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ బాబు నేతృత్వంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూసమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం రైతులు, ప్రజలు వివిధ భూ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు శ్రీరాములురెడ్డి, రామలింగారెడ్డి, వెంకటరమణ, మంజునాథరెడ్డి, బాబు పాల్గొన్నారు.

## కైగల్‌ను పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి 3, ప్రభాతవార్త:

బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్‌ను పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కైగల్ వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ నిర్ణయాలే సమస్యలకు కారణమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి మండలంలో రెవెన్యూ సమస్యలు నెలకొన్నాయన్నారు. టిడిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాడంతో పాటు ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ సైతం తీసుకురావడం జరిగిందన్నారు. కైగల్‌లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటి పరిష్కారంతో పాటు కైగల్‌ను పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేసి పలమనేరుకు తలమానికంగా తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాదవరాజు, టిడిపి మండల అధ్యక్షులు కిశోర్ గౌడ, ప్రాధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, వి.కోట మండల అధ్యక్షులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి-బి.సి ఫ్రెంట్ నాయకులు

పలమనేరు, జనవరి 3, ప్రభాతవార్త:

పలమనేరు నియోజకవర్గం పరిధిలోని గంగవరం, పెద్దపంజాణి మండలం తహశీల్దార్లుగా పని చేసిన శివకుమార్, ప్రసన్నకుమార్‌లను శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించాలని బి.సి ఫ్రండ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ భవానికు బి.సి ఫ్రెంట్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారి కృష్ణకుమార్ పై దౌర్జన్యం, దాడి ఘటనలో ఇద్దరు తహసీల్దార్‌లను శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించాలని అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిటీ ఏర్పాటు చేసి మండలంలో వారు చేసిన అవినీతిని గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి బి.సి ఫ్రెంట్ అధ్యక్షులు పూలే గోవిందస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేరంగుల సుబ్రమణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటరమణ, పలమనేరు పట్టణ అధ్యక్షులు జి.లక్ష్మీపతి యాదవ్, గౌరవ అధ్యక్షులు వి.నంజుడప్ప తదితరులు పాల్గొన్నారు.

## మహిళల్లో ఆణిముత్యం సావిత్రిభాయి పూలే

చౌడేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త

మహిళల్లో ఆణిముత్యం సావిత్రిబాయి పూలే అని పలువురు కొనియాడారు. సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకొని మండలంలోని పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మహిళలు సామాజికంగా, వ్యక్తిగతంగా ఎదుగుదలకు సావిత్రిభాయిపూలే అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేసారు. దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలుగా సమాజానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు అరుణకుమారి, విజయలక్ష్మి, భారతి, స్వర్ణలత, పరిమళ, పూర్ణిమ, ఉమ, కవిత, కళ్యాణి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## గంగా భవానీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 3 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో వేద ఆలయ అర్చకులు, పండితులు గోవర్ధనశర్మల ఆధ్వర్యంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, ఆలయ అధికార, సిబ్బంది, అర్చకులు సేవలందించారు.

సిడిపిఎల్ 2 : విశేషాలంకరణలో అమ్మవారు

## క్లీన్ అండ్ గ్రీన్ చౌడేపల్లికు సహకరించండి

చౌడేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త





చౌడేపల్లి మేజర్ పంచాయతీని క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్, కార్యదర్శి మహేష్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని చికెన్ దుకాణాల యజమానులతో సమావేశం జరిగింది. మాంసపు దుకాణాల నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయరాదన్నారు. పంచాయతీ సిబ్బంది వచ్చి వాటిని సేకరిస్తారనీ, వారికి అందరూ సహకరించాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే పాలనా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# భూమి యజమాని హక్కు

### కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి ముట్టుకూరు జగపతి

పూతలపట్టు, జనవరి 3, ప్రభాతవార్త

ప్రభుత్వం పట్టాదారు పాసు పుస్తకం భూమి యజమాని హక్కు చిత్తూరు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి ముట్టుకూరు జగపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ భూమిని మీకు తెలియకుండా ఇతరుల పేరు మీదికి మారిస్తే విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మండల సర్వే యార్ తాసిల్దార్ సెక్షన్ 197 సి ఆర్ పి సి ప్రకారం నేరస్తులు అవుతారు. తప్పు చేసిన ప్రతి ప్రభుత్వ అధికారుల మీద క్రిమినల్ చర్యలు తీసుకొనవచ్చు అని అన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు విషయంలో ఒకరి భూమి మరో ఒకరి వన్ బి అడంగల్ మంజూరు చేస్తే అడంగల్, వన్ బి కరెక్షన్ కోసం రైతులు ఆర్ ఓ ఆర్ చట్టం కింద రెవెన్యూ డివిజనల్ అధికారి దగ్గర ఆపిల్‌గాని జాయింట్ కలెక్టర్ దగ్గరకు గాని ఆపిల్ వెళ్లవలసిన అవసరం లేదు మీతో విచారణ చేయకుండా మీ భూమిని ఇతరులకు ఆన్లైన్ నందు వన్ బి అడంగల్ పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేసినందుకు గాను విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మండల సర్వేయర్ తహసీల్దార్ సెక్షన్ 197 సిఆర్పిసి ప్రకారం నేరస్తులు అవుతారని తెలిపారు. వీరు మీద చర్యలు తీసుకోమని పై అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, పై అధికారులు చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సుబ్రకోటి ఇచ్చిన తీర్పు క్రిమినల్ ఆపిల్ నెంబర్ 1 837/2019 కింద శిక్ష అర్హులు ప్రతి ప్రభుత్వ అధికారికి వర్తిస్తుంది మీదికి మారిస్తే విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మండల సర్వే యార్ తాసిల్దార్ సెక్షన్ 197 సి ఆర్ పి సి ప్రకారం నేరస్తులు అవుతారన్నారు. తప్పు చేసిన ప్రతి ప్రభుత్వ అధికారుల మీద క్రిమినల్ చర్యలు తీసుకొనవచ్చు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు విషయంలో ఒకరి భూమి మరో ఒకరి వన్ బి అడంగల్ మంజూరు చేస్తే అడంగల్ మరియు వన్ బి కరెక్షన్ కోసం రైతులు ఆర్ ఓ ఆర్ చట్టం కింద రెవెన్యూ డివిజనల్ అధికారి దగ్గర ఆపిల్ గాని జాయింట్ కలెక్టర్ దగ్గరకు గాని ఆపిల్ వెళ్లవలసిన అవసరం లేదు మీతో విచారణ చేయకుండా మీ భూమిని ఇతరులకు ఆన్లైన్ నందు వన్ బి అడంగల్ పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేసినందుకుగాను విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మండల సర్వేయర్ తహసీల్దార్ సెక్షన్ 197 సిఆర్పిసి ప్రకారం నేరస్తులు అవుతారు వీరు మీద చర్యలు తీసుకోమని పై అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు పై అధికారులు చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సుబ్రకోటి ఇచ్చిన తీర్పు క్రిమినల్ ఆపిల్ నెంబర్ 1 837/2019 కింద శిక్ష అర్హులు ప్రతి ప్రభుత్వ అధికారికి వర్తిస్తుందన్నారు.

## తవణంపల్లె హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు ఎలక్ట్రికల్ బెల్ వితరణ

తవణంఎపకల్లె, జనవరి 3 ప్రభాతవార్త:

మండల కేంద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు సుమారు 30 వేల రూపాయలు విలువగల ఆటోమేటిక్ ఎల్క్ట్రికల్ బెల్, ఇతర సామాగ్రిని శుక్రవారం విరాళంగా అందజేశారు. పాఠశాలలో 1991-92 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక గత నెల 22న పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని పూర్వ విద్యార్థులు తీర్మానించారు. ఈమేరకు సుమారు 30 వేల రూపాయలు విలువగల ఆటోమేటిక్ ఎలక్ట్రికల్ బెల్‌ను విరాళంగా అందజేశారు. అలాగే పాఠశాలకు అవసరమయ్యే బీరువా, పోడియం, కుర్చీలను విరాళంగా అందజేశారు. వీటిని పాఠశాల హెచ్ఎం దేవరాజులురెడ్డి, విజయకృష్ణారెడ్డి, లవన్ కుమార్‌రెడ్డిలకు అందజేశారు. ఈకార్యక్రమంలోపూర్వ విద్యార్థులు సంపత్‌కుమార్, రాజారమేష్, జగదీశ్వరనాయుడు, చంద్రమోహన్, తులసి ప్రబ, శైలజ, లీలామనోహర్, నాగరాజ, అనంతకుమార్, ఇన్బునాధన్, మురుగేష్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

పెనుమూరు, జనవరి 3 ప్రభాతవార్త:

శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిరుపేదలైన వికలాంగులు, బుద్ధిమాంద్యం, లెప్రసీ వారికి ఇళ్ళ వద్దకు వెళ్ళి మండలి సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శ్రీసత్యసాయిబాబా సేవా సమితి అధ్యక్షులు మధుసూధన్, సమన్వయకర్త గజేంద్రరెడ్డి, సత్యసాయి భజన మండలి కన్వీనర్ గోపినాథ్ చౌదరి, సభ్యులు పాపమ్మ, చంద్రకళ, అంజలి, లోకనాధం తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి



వడమాలపేట, జనవరి 3 ప్రభాతవార్త: వడమాలపేట మండల పరిధిలో జరిగిన శుక్రవారం రాత్రి జరిగిన రెండు వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. వడమాలపేట మండలం ఎస్వీ పురం గుట్టకింద అరుంధతివాడకు చెందిన చిరంజీవి(47) టీటీడీ అన్నదానం క్యాంటిన్‌లో పని చేస్తున్నాడు. రోజు గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై తిరుపతికి వెళ్లి అక్కడ నుంచి బస్సులో వెళ్లి డ్యూటీ చేసుకుని వచ్చేవాడు. శుక్రవారం సాయంత్రం డ్యూటీ చేసి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కదిరిమంగళం సర్కిల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే తమిళనాడులోని పెరింబుదూరుకు చెందిన కార్తీక్(22), గౌతమ్(20) అన్నదమ్ముల్లు సొంత పనుల నిమిత్తం తిరుపతికి బయలుదేరి వెళ్లారు. వడమాలపేట మండలం పాదిరేడు సమీపంలో ముందు వెళుతున్న లారీని అధిగమించే ప్రయత్నంలో అదుపు తప్పి అదే లారీ వెనుక చక్రాల కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా గౌతమ్‌కు కాలు విరిగిపోయింది. వీరిని టోల్ ప్లాజా వాహనంలో తిరుపతి రుయాకి తరలించారు. రెండు సంఘటనలను పరిశీలించిన వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సమాజ నిర్మాణంలో మహిళా టీచర్ల పాత్ర ముఖ్యమైనది



పుత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త : సమాజ నిర్మాణంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. బాలికా విద్య కోసం విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కాలేజీ ఆవరణలోని సాయిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా అధిక శాతం మహిళలు ఉపాధ్యాయులుగా వుండడం వల్ల బాలికా విద్య వ్యాప్తి చెందిందని తెలిపారు. ఆమె ఆశయ సాధన దిశగా అందరూ బాలికా విద్య వ్యాప్తికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ కోటేశ్వరయ్య, వి.వీరయ్య, అధ్యాపకులు డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ, డాక్టర్ పి.సుజన, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వాసవి, డాక్టర్ ఎం.షర్మిల, డాక్టర్ ఎ.దేవకి, డాక్టర్ సుజల తదితరుల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పొన్నాలమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త : ధనుర్మాసం సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని పరాశక్తి శ్రీశ్రీశ్రీ పొన్నాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పది మంది ఉభయదారులతో అభిషేకాలు, అర్చన, నైవేద్యం, అఖండ హారతి జరిగింది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఎంపికైన వారు వీరే

తొట్టంబేడు, జనవరి 3 ప్రభాతవార్త : శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రదర్శనలను ప్రకటించారు. పట్టణంలోని మున్సిపల్ బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎన్.చరణ్ రూపొందించిన ఆటోమేటిక్ ఇంజన్ లాక్ సిస్టం గైడ్ టీచర్ కె.వరలక్ష్మిలు ఎంపికవగా ద్వితీయ బహుమతిగా పాకాల మండలం జిల్లా పరిషత్ ఓబులచిట్టివారిపల్లి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.రాజశేఖర్ రూపొందించిన రైన్ వాటర్ హార్వెస్టింగ్ ద్వితీయ బహుమతిని సాధించగా,గ్రూపు విభాగంలో వరదయ్యపాళెం జిల్లా పరిషత్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న కె.రితీష్ రూపొందించిన స్మార్ట్ బ్లైండ్ వాకింగ్ స్టిక్ ప్రథమబహుమతితో సాధించగా గైడ్ టీచర్‌గ కె.మేఘనాధ్ వ్యవహరించారు. సూళ్ళూరుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు కె.వరుణ్‌రెడ్డి, పి.గణేష్‌లు రూపొందించిన వర్కింగ్ ఆఫ్ జెసిబి బహుమతులు సాధించగా గైడ్ టీచర్‌గా పి.గజేంద్ర వ్యవహరించారు. ఉపాధ్యాయులు విభాగంలో శ్రీకాళహస్తి ఆర్‌పిబిఎస్ ఉన్నత పాఠశాలలో కె.మధుసూధనరావు డిసేబుల్ ఫ్రెండ్లీ బస్, మరియు ఎం.సుబ్బరామయ్య రూపొందించిన రోలింగ్ బ్యారర్స్ వరదయ్యపాళెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు దక్కించుకున్నారు. వీరు ఈనెల 6,7 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హజరవ్వాల్సి ఉంది.

## ఉపాధి హామీ చట్టం అమలు ఘనత మన్మోహన్‌దే



తిరుపతి(రవాణ),జనవరి 3(ప్రభాతవార్త): దేశంలోని గ్రామీణప్రాంతాల ప్రజల జీవన నైపుణ్యం పెంపొందించడానికి, ఆర్థిక అభివృద్ధికి 2005లో గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రవేశంపెట్టిన ఘనత ప్రధానిగా మన్మోహన్‌సింగ్‌దేనని తిరుపతి జిల్లా కాంగ్రెస్ నేతలు కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటానికి, అభివృద్ధి వైపుపరుగులు తీయడానికి ప్రధానిగా ఆరోజు ఆయన గట్టి పునాదులు వేశారని కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు. తిరుపతిలో శుక్రవారం మన్మోహన్ సంతాపసభలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ నాయకులు నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు, జిల్లా అధ్యక్షుడు బాలగురవంబాబు, జిల్లా నేతలు మాంగాటి గోపాల్‌రెడ్డి, దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, వెంకట నరసింహులు, వెంకటాచలపతి, దామోదర్‌రెడ్డి, చిత్తూరు శివశంకర్, తలారి గోపి, గోడుగుచింత గోపీ, కబీర్, పార్థసారధి, చిరంజీవి, మల్లికార్జున,శివబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిపూలే జయంతిన...ఉపాధ్యాయిని లేఖశ్రీకి సన్మానం



తిరుపతి(రవాణ),జనవరి 3(ప్రభాతవార్త): తిరుపతి తీర్థకట్టవీధిలోని పురపాలక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సావిత్రిపూలే జయంతిన ఆ పాఠశాల ఉపాధ్యాయిని పిఎం లేఖశ్రీని బిజెపి నాయకులు సన్మానించారు. మహిళలు విద్యావంతులైతేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని పూలే భావించి జ్యోతిరావు పూలే తన సతీమణిని చదివించారని బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, లోకప్రభాకర్‌నాయుడు, కస్తూ పద్మనాభన్, విజయభాస్కర్‌రెడ్డి, కల్యాణి పాల్గొని సావిత్రిపూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

## సావిత్రిబాయి పూలేకి నివాళులర్పించిన మేయర్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 3 ప్రభాతవార్త : తిరుపతి పద్మావతి మహిళ యూనివర్సిటీ సమీపంలో సీతమ్మ నగర్ కూడలిలో బీ.సీ. సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తదితరులు శుక్రవారం వారి చిత్రపటానికి ఆవిష్కరణ చేసి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, బీసీ సంఘర్షణ సమితి సభ్యులు అక్కినపల్లి లక్ష్మయ్య యాదవ్, కేశవులు, సాకం నాగరాజు,సాకం ప్రభాకర్, అశోక్ సామ్రాట్ యాదవ్, మస్తానమ్మ, పెంచలయ్య, మురళి, డిష్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు :ట్రాఫిక్ డీఎస్పీ

తిరుపతి కార్పొరేషన్, జనవరి 3 ప్రభాతవార్త : ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణాచారి హెచ్చరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిఎస్పి మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణచారి, కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 3 ప్రభాతవార్త : పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పకుండా ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించి, పట్టణ ప్రణాళిక విభాగంలో వచ్చే ఫిర్యాదులు చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. మార్చి నెలాఖరులోపు పెండింగ్‌లో ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏసిపి బాలాజి, టిపిబిఒ లు మధుసూదన్, వంశీ, అన్ని సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## తిరుపతిరూరల్లో... రసభసాగా గ్రామసభలు

-గ్రామసభల్లో... పంచాయతీ కార్యధర్శులే లక్ష్యం
-ఓటేరులో సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామసభ బహిస్కరణ




తిరుపతిరూరల్, జనవరి3 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలాలైన అవిలాల, గాంధీపురం, ఓటేరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలు రసభసాగా కొనసాగాయి. గ్రామసభల్లో ఆయా పంచాయతీల అభివృద్ధి పనులపై చర్చ జరగకుండా వ్యక్తిగతంగా పంచాయతీ కార్యధర్శులను టార్గెట్ చేస్తూ బహిరంగ ఆరోపణలకు దిగారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా పంచాయతీలలో నూతన కార్యదర్శులు విధులు నిర్వహిస్తూ...గత పంచాయతీ పాలకుల విచ్చలవిడి తనానికి అడ్డుకట్ట వేయడం, మరో పక్క స్థానికంగా ఉన్న కూటమి నాయకులు గ్రామసభల్లో పాల్గొనడంతో గ్రామసభలు పక్కదారి పట్టాయి. గ్రామసభలు నిర్వహిస్తున్నామని, తప్పకుండా అందరూ హాజరుకావాలని, డప్పుకొట్టి దండోర వేయించడంతో పాటు వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరికి ఫోన్ ద్వారా సమాచారం తెలియజేసిన, మాకు చెప్పలేదని కార్యధర్శులపై గ్రామసభల్లో ఆరోపణలు చేసారు. ఓటేరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభల్లో తమకు సరైన గౌరవం, గుర్తింపు ఇవ్వలేదని సర్పంచ్ లక్ష్మీ, ఉపసర్పంచ్ మౌళి గ్రామసభను బహిస్కరించారు. బిల్లు కలెక్టర్‌ను ఎవర్ని అడిగి తొలగించారు... ఎందుతొలగించారు... కొత్త వ్యక్తిని ఎలా బిల్లు కలెక్టర్‌గా విధులు అప్పజెప్పుతారని ప్రశ్నించారు. పంచాయతీలో బిల్డింగ్ నిర్మాణాలకు అవసరమైన అనుమతులు కోసం లక్షలు వసూలు చేసారని, తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని బిజెపి నాయకుడు ఈశ్వర్ ఆరోపించారు. ఓటేరు బిల్లు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శేషాద్రి సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని...అందుకే తాత్కలికంగా బిల్లు కలెక్టర్‌గా వేణు అనే వ్యక్తి నియమించినట్లు పంచాయతీ కార్యధర్శి లావణ్య తెలిపారు. టిడిపి నాయకుల వ్యవహార శైలివల్ల పంచాయతీలో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని, కార్యదర్శి పదేపదే విసిగిస్తున్నారని ఆరోపించారు. విధులకు హాజరుకాని సిబ్బంది మాత్రమే తొలగించాలని, కక్ష సాధింపుతో తొలగించరాదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేసారు. స్థానిక నాయకులు వ్యక్తిగత ఆరోపణలు చేసుకోకుండా పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కార్యదర్శి విజయనిర్మల కోరారు.

## పాడి రైతన్నల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం : ఎంఎల్‌ఏ



చంద్రగిరి, జనవరి 3 ప్రభాతవార్త: పాడి రైతన్న సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలోని ఆరేపల్లి రంగంపేటలో శుక్రవారం మినీ గోకుళం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో పాడిరైతులకు గోకులాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పశుసంవర్ధకశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులను కోరినట్లు తెలిపారు. సానుకూలంగా వారు ఏ.రంగంపేట నుండి భీమవరం వరకు 103 గోకుళాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మినీగోళం ప్రాజెక్ట్ స్పెషలాఫీసర్ (డిపిఓ) డి.సుశీలాదేవి, ఎంపిడిపిడి శ్రీనివాస వరప్రసాద్, ఏపిడి చిన్నరెడ్డెప్ప, శేఖర్, తహాశీల్దార్ శివసుబ్బరామయ్య, ఏపిఓ జ్యోతి, టిడిపి నాయకులు సింగు సుధ, వీరంగారి రమేష్ రెడ్డి, కొండూరు ప్రవీణ్ రాయల్, టెక్నికల్ అసిస్టెంట్ గోపి, ఎఫ్ఎ సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ కౌన్సిల్ మెంబర్‌గా నిరంజన్‌బాబు



రామచంద్రాపురం, జనవరి 3 ప్రభాతవార్త: ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ మెంబర్‌గా సెవెన్‌హిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. నింజన్ బాబును నియమించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎం.సుమలత తెలిపారు. శుక్రవారం వెంకట్రామాపురంలో ఆమె విలేకరులతో పాట్లాడుతూ సెవెన్‌హిల్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అరుదైన గౌరవం లభించడం అభినందనీయమన్నారు. పట్టుదల, కార్యధక్షత ఆయన సొంతమని కొనియాడారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు




రామచంద్రాపురం, జనవరి 3 ప్రభాతవార్త: భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి తెలిపారు. శుక్రవారం పుల్లమనాయుడు కండ్రిగలో మీ భూమి మీ హక్కు రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు అధికంగా గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ లక్ష్మీనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు మురళీమోహన్, రెడ్డెప్ప నాయుడు, నరశింహులు నాయుడు, యల్ఎం నాయుడులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



తిరుపతి విద్య జనవరి 2 ప్రభాతవార్త: పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం, వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి ఘనం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీలో ఉత్తమ సేవలందించిన 10 మంది బోధన, బోధనేతర మహిళా సిబ్బందికి సావిత్రిబాయి పూలే పురస్కారం 2025 ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్ రజిని,తుడా సెక్రెటరీ జి వెంకటనారాయణ,సీఐ కే మధుసూధన్,వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పి అంకయ్య,వర్సిటీ బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సంస్కృత వర్శిటీలో సావిత్రీభాయి జయంతి

తిరుపతి విద్య, జనవరి 3 ప్రభాతవార్త: జాతీయ సంస్కృత వర్శిటీ లో శుక్రవారం సావిత్రీభాయి పూలే 194వ జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి మొదటగా సావిత్రీభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సాహిత్య సంస్కృతి డీన్ ప్రొ.సత్య నారాయణా చార్య, ఎడ్యుకేషన్ డీన్ ప్రొ.ఎన్.లతా, రిజర్వేషన్ సెల్ చైర్మన్ మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్ డా.జె.బలిచక్రవర్తి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.ఎ.చం దూలాల్, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగాధిపతి ప్రొ.శివరామభట్ మరియు ఇతర విభాగాల అధ్యాపకులు డా.డి.నల్లన్న,డా.లీనాచంద్ర, డా.విజయలక్ష్మీ, వి.సేతురామ్ విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## శివయ్య సేవలో చైర్మెన్



శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాష్ట్ర ఖాదీ,విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మెన్ కె కె.చౌదరి స్వామి అమ్మవార్లకు పూజలు జరుపుకున్నారు. వారికి శ్రీకాళహస్తి మాజీ వ్యవసాయ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు సారధ్యంలో తెలుగుదేశం నాయకులు బాలాజిం రెడ్డి, రవిలు పర్యవేక్షించారు. ఆలయ పిఆర్ఓ రవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## శివయ్య హుండీ రాబడి రూ.1.76 కోట్లు



శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరునికి భక్తులు నెల రోజుల పాటు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. హుండీల్లో కరెన్సి రూ.1.7కోట్లు రాగా చిల్లర నాణెములు రూ.5.95లక్షలు వచ్చినట్లు వివరించారు. లెక్కింపును డెప్యూటీ ఇఓ ఎన్.ఆర్ కృష్ణారెడ్డి ఇఇ మురళీధర్‌రెడ్డి, ఏఇఓలు పర్యవేక్షించారు. బంగారు ఆభరణాలు 73 గ్రాములు, వెండి నాగపడగల రూపంలో 488కిలోల 550 గ్రాములు వచ్చిందని తెలిపారు. కాగా అమెరికా,మలేషియా,ఆస్ట్రేల్ల,సింగపూర్, థ్యాయ్‌లాండ్ దేశాలకు సంబంధించి 186నోట్లు వచ్చినట్లు వివరించారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలో హుండీ ఆదాయాలు పెరుగుతున్నాయన్నారు. ఇంకా పూర్తి స్థాయిలో సంస్కరణలు అమలు జరిగితే హుండీల్లోనే రూ.3కోట్లు వస్తుందని ఇఓ బాపిరెడ్డి అభిప్రాయపడ్డారు. 30రోజుల పాటు భక్తులు వర్షాల్లో సైతం సమర్పించిన కానుకలను లెక్కించినట్లు వివరించారు.

## సాధ్యాసాధ్యాలను బట్టి పరిష్కారం



శ్రీకాళహస్తిరూరల్,జనవరి 3 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలోని పెద్ద అంజిమేడులో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. మాజీ సీడ్స్ డైరెక్టర్ కందాటి శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ప్రజలు తమ గ్రామానికి, వ్యవసాయానికి సంబంధించి 55 అర్జీలు ఇచ్చారు. ముఖ్యంగా గ్రామానికి రావటానికి ప్రస్తుతం హైవే రావటంతో కొంత ఇబ్బందిగా మారిందని ఫిర్యాదు చేసారు.అయితే రెవెన్యూ సదస్సును నిర్వహించిన తహాశీల్దార్ భార్గవి సమస్యల్లో ఆర్థిక పరంగా లేనిది పరిశీలించి సాధ్యాసాధ్యాలను పరిగణలోకి తీసుకొని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు నైనారు పొన్నారావు సీనియర్‌నేతలు ధనంజయులు నాయుడు, గ్రామకమిటి అధ్యక్షుడు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోవిందన్న ఇసుకతాగేలి కార్యదర్శి గోవిందన్న, ఇసుక తాగేలి పంచాయతీ కార్యదర్శి మండలడిటి తదితర అధికారులు హాజరయ్యారు.

## ఆపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కార్వేటినగరం,జనవరి 3 ప్రభాతవార్త: కార్వేటినగరం ఆర్.కె.యస్.ఆర్.ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను మండల విద్యాశాఖాధికారులు యం.విజయ్ కుమార్, మనోజ్‌కుమార్‌లు ఆవిష్కరించారు. వాళ్ళు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం తమ వంతు పాత్రను పోషిస్తుందన్నారు.కార్యక్రమంలో చిత్తూరుజిల్లా ఉపాధ్యక్షులు కరణం గిరిబాబు,జిల్లా క్రీడాకన్వీనర్ మాండవ్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఊంజల్‌సేవలో అలరించిన పద్మావతీ అమ్మవారు



నారాయణవనం, జనవరి 3 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని తిరుప్పావై ప్రవచనంతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం : డాక్టర్ పెంచలయ్య

పుత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ పెంచలయ్య అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలలో ఈ నెల 2,3 తేదీల్లో జరిగిన మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తల్లితండ్రుల, గ్రామ పెద్దల సహకారంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరి ంచినపుడే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయన్నారు. పాఠశాలలకు సరఫరా అవుతున్న మధ్యాహ్న భోజనం నాసిరకంగా వుండడం వల్ల అధిక శాతం పిల్లలు భోజనం చేయడం లేదని యాజమాన్య కమిటీ సభ్యులు పరిశీలకుడి దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఆయన ఇస్కాన్ మధ్యాహ్న భోజన కమిటీ సభ్యులతో చర్చించి రుచికరమైన భోజనం సరఫరా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిఎంఓ సురేష్, ఎంఇఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, నోడల్ ప్రధానోపాధ్యాయులు ఆనందబాబు, రిసోర్స్ పర్సన్ లత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేత బీడు భూములపై న్యాయం చేయాలి

### పశువులను తోలి గ్రామస్తులు నిరసన

సత్యవేడు, జనవరి 3 ప్రభాతవార్త: తమ గ్రామంలోని మేత బీడు భూములు ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండల పరిధిలోని పేరడం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు వినతులు ఇచ్చిన స్పందన లేదంటూ ఏకంగా వారు శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు పశువులు, బర్రెలను అక్కడకు తరలించి నిరసన వ్యక్తం చేశారు. సర్వే నెం.191,192, 193,194,218లలో సుమారు 21 ఎకరాల మేత బీడు భూములు దశలవారీగా ఆక్రమణలకు గురవుతున్నాయని పేరడం వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతసేపు నిరసన వ్యక్తంచేసి అనంతరం రెవెన్యూ సదస్సు జరిగేందుకు తాము అవకాశం కూడా ఇచ్చామని పాడి రైతులు, గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పేరడం గ్రామానికి చెందిన మునస్వామి, వాసుదేవ నాయుడు, వెంకటేశ్వరులు, జనార్ధన్, విజయన్, రాధ, శివయ్య, మనీ, శారదమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వీరాస్వామికి ఉత్తమ సేవా ప్రశంసాపత్రం



వడమాలపేట, జనవరి 3 ప్రభాతవార్త: వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ పని చేస్తున్న వీరాస్వామికి ఉత్తమ టెక్నీషియన్ అవార్డుకు ఎంపికైనట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ తెలిపారు. శుక్రవారం వడమాలపేట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ టెక్నీషియన్ వీరాస్వామి రోగుల రక్తం పరీక్షల రిపోర్టులు సకాలంలో ఇస్తూ చురుగ్గా పని చేస్తున్నందుకు అభినందిస్తూ ఉత్తమ పనితీరుకు అవార్డు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు చక్రపాణి, భాను రేఖ, సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో తీరుపై ధ్వజమెత్తిన శ్రీహరిపురం వాసులు

విజయపురం, జనవరి 3 ప్రభాతవార్త: విజయపురం ఎంపీడీవో తీరుపై మండలంలోని శ్రీహరిపురం వాసులు శుక్రవారం ధ్వజమెత్తారు. గురువారం ఎంపీడీవో రమణప్రకాష్ సాయంత్రం సచివాలయానికి తాళం వేసి సిబ్బంది విధులకు డుమ్మా కొట్టారని పత్రికా ప్రకటన చేశారు. కానీ వాస్తవానికి పూర్తిగా విరుద్ధమని గ్రామస్తులు తెలిపారు. కోతుల బెడద వలన సచివాలయానికి చిలుకు పెట్టి పన్నులు వసూలు చేయడానికి గ్రామంలో వెళ్లితే ఆయన తనిఖీ నిమిత్తం వచ్చారని, సిబ్బందుల ద్విచక్రవాహనాలు కూడా కార్యాలయ ఆవరణంలోనే ఉన్నిందని, ఎక్కడ వెళ్లారంటూ మద్యం మత్తులో చిందులు తొక్కుతూ సచివాలయానికి తాళం ఆయనే స్వయంగా వేసి బీగాలు కూడా తన వెంట తీసుకెళ్లారని, సంఘటనా స్థలానికి చేరుకున్న సచివాలయ సిబ్బందిని పట్టించుకోకుండా నానా మాటలు మాట్లాడారని స్థానికులు తెలిపారు.

**డీఎల్‌డీవో తనిఖీ :**

మండలంలోని శ్రీహరిపురం సచివాలయాన్ని శుక్రవారం నగరి డీఎల్‌డీవో ఖాదర్‌బాషా తనిఖీ నిర్వహించారు. సచివాయలంలో జరుగుతున్న అంశాల పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, స్థానికులతో మాట్లాడి సమాచారం సేకరించారు. పూర్తి నివేదికను జడ్పీసీఈవోకు అందిస్తున్నట్లు తెలిపారు.

## పోలీసులకు అభినందనలు



రేణిగుంట జనవరి 3 ప్రభాతవార్త : రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్న పోలీసు అధికారులకు సిబ్బందికి శుక్రవారం అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, గురుమూర్తి, మునుస్వామి,విష్ణు తదితరులు పాల్గొన్నారు

## ఆషా ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవం..

రేణిగుంట జనవరి 3 ప్రభాతవార్త : భారత దేశ ప్రథమ మహిళా ఉపాధ్యా యురాలు ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక ఆషా కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## హైందవ శంఖారావం జయప్రదం చేయండి

రేణిగుంట జనవరి 3 ప్రభాతవార్త : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి ఐదో తేదీ విజయవాడలో జరిగే హైందవ శంఖారావ బహిరంగ సభను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు రేణిగుంట పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బీడీ బాలాజీ నేతృత్వంలో ర్యాలీ రేణిగుంట రామాలయం నుండి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. కార్యక్రమంలో పలువురు హిందువులతో పాటు విశ్వహిందూ పరిషత్ నేతలు పాల్గొన్నారు. ఆర్ జి టి5. ర్యాలీ దృశ్యం.

## ఎస్వీయూలో సావిత్రిబాయి పూలే కు ఘన నివాళులు



తిరుపతివిద్య,జనవరి 3 ప్రభాతవార్త: భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను ఎస్వీ యూనివర్సిటీ ప్రకాశం భవనం వద్ద ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అనురాధ, డాక్టర్ చిరంజీవి, రాజేష్, డాక్టర్ ప్రవీణ్ డాక్టర్ సుబ్రమణ్యం , డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి ప్రమోద్ పవన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## డిప్లొమో ఫలితాల విడుదల

తిరుపతి విద్య జనవరి 3 ప్రభాతవార్త: పద్మావతి మహిళా వర్సిటీలో గత ఏడాది డిసెంబర్ నెలలో జరిగిన డిప్లొమో, పీజీ డిప్లొమో ఇన్ యోగా ఎడ్యుకేషన్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను పరిశీలించాలని అధికారులు తెలిపారు.

## రెవెన్యూ సదస్సులన సద్వినియోగం చేసుకోండి

-రాష్ట్ర తెదేపా కార్యదర్శి



తొట్టంబేడు, జనవరి 3 ప్రభాతవార్త : ప్రతి చిన్న సమస్యలను కూడా రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరులో ఏర్పాటు చేసిన సభకు ఆయన హజరయ్యారు. వీరికి తహాశీల్దార్ మధుసూధనరావు స్వాగతం పలికారు. రెవెన్యూ సదస్సులను ఉద్దేశించి గాలిచలపతినాయుడు మాట్లాడుతూ ఈ సదస్సులు అన్నదాతలకు ఎంతో ఉపయోగపడుతాయని ముఖ్యంగా అన్నదాతలు తమ భూసమస్యలను పరిష్కరించుకునేందుకు ఈసదస్సులు చక్కని ఉపయోగపడుతాయన్నారు. భూసమస్యలే కాకుండా గ్రామంలో ఉన్న చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహాశీల్దార్ మధుసూధనరావుతో పాటు సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి,విఆర్ఓలు కమ్యూనిటీ సర్వేయర్ సత్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్‌కెఆర్‌లో కాంగ్రెస్ 47వ వార్షిక సమావేశం



గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త : ఈనెల 4, 5 తేదీలలో గూడూరు పట్టణం లోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఆంధ్ర ప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 47వ వార్షిక సమావేశం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి ప్రధాన అధ్యక్షునిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత చరిత్ర ఆచార్యులు డాక్టర్ ఎ.ఆర్.రామచంద్రారెడ్డి వ్యవహరిస్తారు. ప్రాచీన ఆంధ్ర చరిత్ర పురావస్తుశాస్త్రం అనే అంశంపై జరిగే సమావేశానికి ముంబాయి నందు పశ్చిమ భారతీయ పురావస్తు శాఖ సంచాలకులైన డా.తలిశెట్టి శ్రీలక్ష్మి, మధ్యయుగ ఆంధ్ర చరిత్ర అనే అంశం పై జరిగే సమావేశానికి హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయ చరిత్ర శాఖ ప్రధానచార్యులు ప్రొఫెసర్ బి.లావణ్య ప్రసంగిస్తారని తెలిపారు. ఆధునిక ఆంధ్ర చరిత్ర అనే అంశంపై జరిగే సమావేశానికి విజయవాడకు చెందిన డాక్టర్ కొంపల్లి సుందర్, చరిత్ర పరిశోధన పద్ధతి అనే అంశంపై జరిగే సమావేశానికి హైదరాబాద్ నందు గల మోలానా అజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయ డీన్ ఆచార్య ఎం. వనజ, స్థానిక చరిత్ర అనే అంశంపై జరిగే సమావేశానికి నెల్లూరు లోని ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రంలో సీనియర్ ఫెలోగా వున్న డాక్టర్ మమత సోమరాజుపల్లి అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. డాక్టర్ గోవిందు సురేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని పుర ప్రజలు, విద్యార్థులు, చరిత్ర ప్రేమికులు, పరిశోధకులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొన చరిత్రకు సంబంధించిన నిపుణులు అందించే విలువైన విషయాలు తెలుసుకోవాలని కోరారు.

## ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి : సిఐటియు



గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త : ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే పిలుపులో భాగంగా శుక్రవారం గూడూరు పట్టణ మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి ధారా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూసాధారణంగా మరణించిన లేదా ప్రమాదంలో మరణించిన మున్సిపల్ కార్మికులకి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులు మరణించిన వారి కుటుంబంలో ఒకరికి కచ్చితంగా పని కల్పించాలని,పై డిమాండ్లు అమలుకి నోచుకోని పక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా మున్సిపల్ కార్యాలయంలో వద్ద జనవరి 10వ తేదీన దీక్షల్లో కూర్చోవడం జరుగుతుందని, కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాల్సి ఒదిగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప కార్యదర్శి సి. హెచ్.రాజేష్, ఉపాధ్యక్షులు ఏ.పెంచల ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్. వెంకట రమణయ్య, సంపూర్ణమ్మ, మణమ్మ, పట్టణ గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు. నాయకులు పి.శ్రీనివాసులు, బి.వి రమణయ్య, ఎస్.సురేష్, ఏ. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో హుండీ చోరీ

తడ, జనవరి 3 ప్రభాతవార్త : తడ మండలం బోడిలింగాలపాడులోని భువనేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు గుర్తించారు. గుర్తు తెలియని ఆగంతకులు గురువార రాత్రి ఆయలంలోని హుండీని పగులకొట్టి సుమారు ఇరవై వేల రూపాయల సొమ్ము ఆపహరించుకొని వెళ్ళినట్లు శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు ఆలయం బాగోగులు చూసే చంద్రమౌళి, ఏలుమలైరెడ్డి తదితరులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానకి చేరుకొని విచారణ చేపట్టారు.

## చదువుల తల్లి సాయిత్రిబాయి పూలే



తడ, జనవరి 3 ప్రభాతవార్త : సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలని పాములమిట్ట పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సావిత్రిబాయి చేసినటువంటి సేవలకి భారతదేశంలో తొలి ఉపాధ్యాయురాలిగా బీద బలహీన వర్గాల కోసం నిలబడి పోరాడి, బలహీనవర్గాల వారి చదువుల కోసం పాటుపడిందని హెడ్‌మాస్టర్ ఉస్మాన్‌ఖాన్ అన్నారు. విద్యార్థులు వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నతికి చేరాలని తెలిపారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే పాశం




గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త : క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రాంగణంలో రోటరీ క్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్, ఆదిశేషారెడ్డి క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్ క్రికెట్ పోటీలలో గెలుపొందిన జట్టులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. క్రీడాకారులు ఉన్నత స్థాయిలో రాణించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, మునిగిరిష్, క్రికెట్ సిబ్బందిలు పాల్గొన్నారు.

## కోడి పందాలపై స్థావరాలపై దాడి



వాకాడు, జనవరి 3 ప్రభాతవార్త : కోడి పందాలపై స్థావరాలపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కోళ్ళు, 1200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు తెలిపారు. వాకాడు మండలం లోని కోడివాక గ్రామంలో కోడి పందాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ముగ్గురికి అదుపులోకి తీసుకుని, రెండు కోళ్ళు, 1200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదిశంకరలో కోడ్నెస్ట్ డ్రైవ్ విజయవంతం



గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త : ఆదిశంకర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో కోడ్నెస్ట్ సంస్థ 2025 బ్యాచ్ విద్యార్థుల కోసం ప్రత్యేక నియామక డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ డ్రైవ్ ట్రైన్ అండ్ హైర్" కార్యక్రమం కింద జరిగింది, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు 30 లక్షల వరకు ప్యాకేజీతో ఉన్న ఉద్యోగ అవకాశాలను కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో కోడ్నెస్ట్ సీఈఓ ప్రభాకరం, కాలేజీ ఛైర్మన్ వంకి పెంచలయ్య, వైస్ ఛైర్మన్ వంకి అనూష, ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆర్చన, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామయ్య పాల్గొన్నారు. ఈ నియామక ప్రక్రియలో గ్రూప్ డిస్కషన్ మరియు టెక్నికల్ ఇంటర్వ్యూ అనే రెండు దశలు నిర్వహించబడాయి. మొత్తం 27 మంది విద్యార్థులు ఈ ఎంపిక దశలను విజయవంతంగా పూర్తి చేసి కోడ్నెస్ట్ సంస్థలో ఉద్యోగ అవకాశాలను పొందారు. ఈ డ్రైవ్ విద్యార్థులకు శిక్షణతో పాటు ప్రతిష్టాత్మక ఉద్యోగ అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషించింది.

## లెర్నెట్ సంస్థతో ఎస్.కే.ఆర్ కళాశాల ఒప్పందం



గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త : జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల్లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు యువతకు స్వచ్ఛంద ఉపాధి కల్పించేందుకు శిక్షణ అందజేస్తున్న లెర్నెట్ స్కిల్స్ ఎన్జీవో సంస్థతో గూడూరు ఎస్.కే.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యు) కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివప్రసాద్ తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎంప్లాయిబిలిటీ ఎన్హాన్సు మెంట్ ట్రైనింగ్ (జి.ఈ.ఈ.టి) ద్వారా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు 15 రోజులపాటు ఉదయం సాయంత్రంవరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకింగ్ సెక్టార్ కాల్ సెంటర్ ఆపరేటింగ్ రిటైల్ సేల్స్ మార్కెటింగ్, ఐటీ, ఐ.టి.ఈఎస్, కంప్యూటర్ రంగాల్లో ఉపాధి కల్పిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల స్కిల్ డెవలప్మెంట్ అధికారిని లక్ష్మిని సంప్రదించాలని కోరారు.

## సావిత్రిబాయిపూలేకి నివాళులు



నాయుడుపేట, జనవరి 3 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహిం చారు. నాయుడుపేట విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ మునిరత్నం ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే చిత్రపటా నికి పూలమాలలువేసి నివాళర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపాల్టి చేర్మేన్ కటకం దీపిక పాల్గొన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన ఉపాధ్యాయులకు అవార్డు అందజేసి సన్మానిం చడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,ఎంపిడిఓ సురేష్‌బాబు,మాజీ ఎమ్‌సి చేర్మేన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి,పలువురు ఉపాధ్యాయులు,తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల చొరవ చూస్తుంటే...తనకు బాల్యం గుర్తుకొస్తుంది : జిల్లా కలెక్టర్




శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల శ్రద్ధాశక్తులను పోటీ తత్వాన్ని చూస్తుంటే తనకు బాల్యం గుర్తుకొస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం సభకు కలెక్టర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని అభిరుచికి తగ్గట్లు తీర్చి దిద్దాలని సూచించారు. తల్లి దండ్రులు వారిని బలవంతపు విద్య కాకుండా ఇష్టపడే సబెక్టులలో ప్రోత్సహించాలని కలెక్టర్ వెంకటేశ్వరన్ సూచించారు.రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ వారికి ధృవీకరణ పత్రాలను,మెమొంటోలను అందించారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక:**

శ్రీకాళహస్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారి వివరాలను నిర్వాహకులు భాను ప్రసాద్ ప్రకటించారు. ఎంపికైన వారికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ అందించారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి.వ్యక్తిగత విజేతల్లో ఆటోమెటిక్ ఇంజిన్ ల్యాకింగ్ పద్ధతిలో శ్రీకాళహస్తి మున్సిపల్ ఉన్నత పాఠశాల బాబూ అగ్రహారానికి చెందిన 8వ తరగతికి చెందిన ఎన్.చరణ్ ఎంపికయ్యారు. మరో విజేత పాకాలకు చెందిన ఓబుల చెట్టి వారి పల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కె.రాజశేఖర్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌కు ఎంపిక చేసారు. గ్రూప్ పోటీల్లో వరదయ్యపాళెంకు చెందిన కె.రితిష్,కె.వరుణ్‌రెడ్డిలు స్మార్ట్ బ్లయిండ్ వాకింగ్ స్టిక్ అంశాన్ని ఎంపిక చేసారు. కాగా సూళూరు పేటకు చెందిన ఉన్నత పాఠశాలకు చెందిన పి.గణేష్, బి జస్వంత్‌కుమార్ జేసిబి ఎలా పని చేస్తుందనే అంశంను ఎంపిక చేసారు.టీచర్ల విభాగంలోశ్రీకాళహస్తికి చెందిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కె.మధుసూధన రావు డిసబల్ బస్‌ను ఎంపిక చేసారు. మరో టీచర్ ఈవింట్‌లో వరదయ్యపాళెంకు చెందిన ఎం.సుబ్బరామయ్యలను ఎంపిక చేసారు.ఈ సందర్భంగా బహుమతి ప్రధానం చేసిన కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగినపుడే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని వివరించారు. నేడు విద్యార్థుల ఆసక్తి గమనిస్తుంటే నాకు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయన్నారు. విద్యార్థి వ్యక్తిగత, విద్యార్థి సామూహిక, ఉపాధ్యాయ విభాగాల్లో జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందించారు.ఈ కార్యక్రమాల్లో డివైఈఓ ప్రభాకర్‌రాజు, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్,ఎంఇఓలు భువనేశ్వరి,బాలయ్య, భాస్కర్, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, కృష్ణయ్య, మాధవయ్యలు పాల్గొన్నారు.

## దేశానికి యువశక్తి మూలస్థంభం : ఎంఎల్‌ఏ




చంద్రగిరి, జనవరి 3 ప్రభాతవార్త: దేశానికి నేటి యువశక్తి మూలస్థంభమని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. ఏపి స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్, సెర్ప్, పారిశ్రామిక శిక్షణా సంస్థ నేషనల్ కెరీర్ సర్వీస్ వంటి సంస్థలతో ఎంప్లాయ్‌మెంట్ ఉద్యోగ కల్పన శాఖ సమన్వయంతో నారావారిపల్లిలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వళన గావించి ప్రార ంభించిన ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ సహాయ సహకారాలతో ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. మెగా జాబ్‌మేళాతో 1200 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. తద్వారా తల్లిదండ్రుల కష్టంలో కొంతైనా పాలుపంచు కోవాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో పలు ఐటి కంపెనీలు రానున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎంఎల్‌ఏ సతీమణి పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల కోసం హాజరైన ప్రతి ఒక్కరికీ అవకాశం లభించాలని ఆకాంక్షించారు. కాగా మెగా జాబ్‌మేళాకు పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత హాజరై తమ అర్హతకు తగిన ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా 1200 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ డి.సుశీలాదేవి, డిఆర్‌డిఏ పిడి శోభన్‌బాబు, సర్పంచ్ బొబ్బా లక్ష్మి, ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి, సిడాప్ సరిత, ఎంపిడిఓ శేఖర్, తహశీల్దార్ శివసుబ్బరామయ్య, పాకాల జడ్పీటిసి నంగా పద్మాజరెడ్డి, డిఎల్‌డిఓ నారాయణ రెడ్డి, టిడిపి నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, సింగు సుధ, కొండూరు ప్రవీణ్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## పదిరోజులు భక్తులకు...తిరుమలలో సకల సౌకర్యాలు

**-టోకెన్లు,టిక్కెట్లు లేకుంటే దర్శనం ఉండదు**



తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు సామాన్యభక్తులకు మరింత సులభతరంగా కల్పించడమే ధ్యేయంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు.దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేనివారిని ఆలయంలోనికి అనుమ తించడం జరగదన్నారు. ఈనెల 10వ తేదీ వైకుంఠ ఏకాదశి, 11న ద్వాదశి పర్వదినాలతోబాటు మరో ఎనిమిదిరోజులు వైకుంఠద్వార దర్శనాలు సామాన్య భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని తెలిపారు. వైకుంఠద్వార దర్శనాలు ఏర్పాట్లు, సౌకర్యాలపై శుక్రవారం సాయంత్రం సమీక్షించారు.

## శేషాచలం అడువుల్లో ఆరుగురు విద్యార్థులు గల్లంతు!



శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు విద్యార్థులు శేషాచలంలోని జలపాతం వద్దకు రెండు రోజుల క్రితం వెళ్ళినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి వరకు అందిన సమాచారం మేరకు తిరిగి ఇంటికి చెరుకోలేదు. అయితే వారిలో ఇద్దరి సెల్‌ఫోన్లు మాత్రం పనిచేస్తున్నాయని, జలపాతం వద్ద వెళ్ళిన స్నేహితులు దారి తప్పినట్లు తెలిసింది. తప్పిపోయిన విద్యార్థుల కోసం రైల్వేకోడూరు పోలీసులు గాలిస్తున్నట్లు తెలియవచ్చింది.

## పత్రికారంగంలో 'వార్త'కు ప్రత్యేక స్థానం

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా.కంచర్ల శ్రీకాంత్**

**- చిత్తూరు జిల్లా వార్త నూతన కేలండర్ ఆవిష్కరణ !!**



కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త : పత్రికా రంగంలో 'వార్త' జాతీయ దినపత్రికకు ప్రత్యేక స్థానం ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, కుప్పం తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా. కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పంలోని తన నివాసంలో 'వార్త' చిత్తూరు జిల్లా నూతన కేలండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలపై వార్త చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం మరలా అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల దరి చేరడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. 'వార్త' నూతన సంవత్సర కేలండర్ తన చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాల్లో సిఎం చంద్రబాబు పిఏ మనోహర్, రాష్ట్ర తెదేపా ఆర్గనైజింగ్ కార్యదర్శి, బిఆర్‌డి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, కుప్పం తెదేపా సలహాదారు నరేష్‌చారి, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, వార్త కుప్పం స్టాఫ్ రిపోర్టర్ అస్గర్, కుప్పం రూరల్ రిపోర్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## సదస్సును సద్వినియోగం చేసుకోండి



వాకాడు, జనవరి 3 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వము రైతుల కోసం రెవెన్యూ సదస్సును ప్రవేశపెట్టిందని ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సీనియర్ నాయకుడు దువ్వూరు వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం వాకాడు మండలం రెవెన్యూ గ్రామా లైన పొళ్ల కండ్రిక, పులి కొర్రు బాలిరెడ్డిపాలెం సచివాలయంలోని సర్పంచి రమణమ్మ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది. రైతులకు ఎలాంటి భూ సమస్యలు వచ్చినా రెవిన్యూ సదస్సులో భూ సమస్యల మీద అర్జీ ద్వారా సమర్పించుకోవాలని రైతులను కోరారు. మండల సర్వేయర్ శకుంతల, వీఆర్వో పోలయ్య, వివిధ శాఖల సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల విద్యకు సావిత్రిబాయి పులే కృషి



కోట,జనవరి 3 ప్రభాతవార్త : మహిళల విద్య కోసం సావిత్రి బాయి ఎంతో కృషి చేశారని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ప్రొఫెసర్ ఇందుమతి అన్నారు. శుక్రవారం సావిత్రిబాయ్ పులే జయంతి సందర్భంగా మండలంలోని విద్యానగర్ ఎన్‌వికేఆర్ సైన్సు అండ్ అర్ట్సు కళాశాలలో పులే చిత్ర పటానికి నివాళిర్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళల విద్య కోసం ఆమె ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఓ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు వల్లీదేవి, గది శ్రీనివాసులు, కోఆర్డినేటర్ .టి.రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీ కీలకం

**-జిల్లా చీఫ్ మానిటరింగ్ అధికారి సురేష్**



వెంకటగిరి, జనవరి 3 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాఠశాలల యాజమాన్య కమిటీ కీలకమని శిక్షణ చీఫ్ మానిటరింగ్ అధికారి సురేష్ తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠశాలల యాజమాన్య కమిటీ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యాజమాన్యం కమిటీ వారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ సి.బాబయ్య, రిసోర్స్ పర్సన్స్ కే నాగేంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

## కోడిపందాలు ఆడే వారిపై కఠిన చర్యలు : డిఎస్పి



వెంకటగిరి, జనవరి 3 ప్రభాతవార్త : సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి రమణకుమార్ హెచ్చరించారు. వెంకటగిరి పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడిపందాలు పేకాటకు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు. పండుగలు సందర్భంగా కోడిపందాలు పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ ప్రశాంతంగా పండగలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఏవి రమణ, ఎస్సైలు సుబ్బారావు, కామినేని గోపి, తదితరులు పాల్గొన్నారు.

## మాలధారణ భక్తులు పాదయాత్రగా కొలితోటకు



వెంకటగిరి, జనవరి 3 ప్రభాతవార్త : చెంచు మహాలక్ష్మి మాలాధారణ ధరించిన భక్తులు, వెలిగొండ కొండల్లో వెలసి ఉన్న కొలితోటకు ఇరుముడితో పాదయాత్రగా బయలుదేరారు. కాశీ విశ్వనాథ స్వామి ఆలయం వద్ద ఇరుముడు కట్టుకొని 300 మంది మొక్కలు తీర్చుకునేందుకు నడిచి వెళ్లారు. ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి గుడి వద్దకు కేరళ మేళవాయిద్యాల మధ్య పంపారు. గత కొన్ని సంవత్సరాల నుండి కొలుచోటకు అమ్మవారి మాల ధరించి ఇనుముడి సమర్పించేందుకు కాలి నడకన వెళుతున్నారు.

## కార్మికులకు వేతనాలు పెంచాలనే ధర్నా



వెంకటగిరి, జనవరి 3 ప్రభాతవార్త :ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు వెంకటగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సి పల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ ధర్నాని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కేటగిరి వైస్‌గా వారికి వేతనాలు పెంచాలని ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచేంతవరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. డైలీ వేజెస్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని అన్నారు. కార్మికులతో దురుసుగా కించిపరిచే విధంగా మాట్లాడినటువంటి మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ నాయకులకు కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయకులు సుబ్బయ్య ఎస్ ప్రసాద్, పులి వెంకటయ్య, సుబ్రహ్మణ్యం, పి రమణయ్య, మాధురి, హరిబాబు, ఇందరమ్మ, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ బొమ్మలు తొలగింపునకు వందల కోట్లు వెచ్చింపు

**- ప్రజాధనం దుర్వినియోగంపై ప్రజల మండిపాటు**



చిట్టమూరు, జనవరి 3 ప్రభాతవార్త : సమగ్ర భూసర్వేలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సర్వే చేపట్టి వేసిన హద్దుల రాళ్లపై జగన్ బొమ్మలు తొలగించేందుకు ప్రస్తుత కూటమి సర్కార్ వందల కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు మండల ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చిట్టమూరు, నాయుడుపేట మండలాల్లో రీసర్వే జరిగిన అన్ని గ్రామాలతో పాటు సర్వే జరగని గ్రామాల్లో కూడా సిద్ధంగా ఉంచిన హద్దురాళ్లపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో పాటు బొమ్మలు తొలగించే కార్యక్రమం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో ఒక్కో రాయికి జగన్ పేరుతో పాటు బొమ్మను తొలగించేందుకు ప్రభుత్వం రూ.5 విడుదల చేస్తుండగా, కాంట్రాక్టు దక్కించుకున్న వారు రూ.2 చొప్పున కూలీలకు ఇస్తున్నట్లు అరవ పాలెం గ్రామంలో సర్వే రాళ్లపై ఉన్న బొమ్మలు తొలగిస్తున్నట్లు వారు చెప్తున్నారు.

## ఉపాధిలో అక్రమాలకు కళ్లెం : కూలీల హాజరుపై నిఘా

కోట, జనవరి 3 ప్రభాతవార్త : గ్రామాల్లో వలసల నివారణ అమలు చేసిన ఉపాధి హామీ పథకం వైసీపీ నాయకులకు కాసులు కురిపించింది. గత ఐదేళ్లలో నిబంధనలకు నీళ్లొదిలారు. అడ్డగోలుగా వ్యవహరించారు. బోగస్ మస్టర్లు వేసి కూలీల పేరుతో భారీఎత్తున అక్రమాలకు పాల్పడి నిధులను పక్కదారి పట్టించారు. ప్రతి పంచాయతీలో కూలీల పేరుతో నకిలీ మస్టర్లు వేశారని ఆరోపణలు వచ్చాయి. గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇలాంటి అక్రమాలకు కళ్లెం వేసేందుకు చర్యలు చేపట్టింది. కూలీల మస్టర్లపై నిఘా పెట్టేందుకు జిల్లా స్థాయిలో పర్యవేక్షణ విభాగాలను ఏర్పాటు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా నిత్యం ఉపాధి పనులకు వెళ్లేలకు కూలీల దినసరి వేతనం పెరుగుతుంది. బోగస్ మస్టర్ల కారణంగా కూలీలకు ప్రభుత్వ నిబంధనల మేరకు రావాల్సి న వేతనంలో కోత పడుతుంది. ఏదయినా ఒక ప్రాంతంలో జరుగుతున్న పనికి పదిమంది కూలీలు హాజరైతే క్షేత్ర సహాయకులు పనికిరాని వారి పేర్లు మస్టర్‌లో వేసి అక్రమాలకు పాల్పడుతు న్నారన్న విమర్శలు ఉన్నాయి. వీరికి పథకంలో పనిచేస్తున్న సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ పనిని కొలతలు ఆధారంగా పదిమంది కంటే ఎక్కువ కూలీలు సర్దుబాటు చేస్తుండటంతో వాస్తవంగా పనులు చేసిన వారికి వేతనం తగ్గుతుంది. కూలీలకు కనీస వేతనాన్ని కేంద్రప్రభుత్వం రూ.300 నిర్ణయించింది. ఇక నుంచి ఎలాంటి అక్రమాలు జరగకుండా రాష్ట్రప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది.

## పేటలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు



నాయుడుపేట, జనవరి 3 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలో ఆర్‌టిసి బస్టాండు సెంటరులో సీమాంధ్ర బీసిసంక్షేమ సంఘం సూళ్ళూరుపేట నియోజక వర్గం అధ్యక్షుడు జువ్వలపాటి మస్తాన్ ఆధ్వర్యంలో పలువురు బిసి నాయకులు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జువ్వలపాటి మస్తాన్ జ్యోతిరావుపూలే సతీమణి సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళర్పించారు. మస్తాన్ మాట్లాడుతూ ఆదర్శ నీయులు సావిత్రిబాయి పూలే సమాజంలో ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిందని ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో బిసి నాయకులు రామయ్య, వినుకొండ, శివ, వినోద్, శేఖర్ తదితరులు ఉన్నారు.